క్లుప్తంగా

ఆలయానికి విరాళం

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచ నటరాజ్ సెంటర్‌కు చెందిన తాటికొండ అప్పారావు, రమణ రూ.5,116 విరాళాన్ని అందజేసినట్లు ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి గురువారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేసినట్లు పేర్కొన్నారు.

రేపు శనీశ్వరునికి తైలాభిషేకం పూజలు..

పెద్దమ్మతల్లి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా జూలై1 శనీశ్వరునికి తైలాభిషేకం పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.116 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

మున్నూరుకాపు సంఘం కమిటీ ఎన్నిక



సంఘం నూతన కమిటీ సభ్యులు

టేకులపల్లి: బొమ్మనపల్లి గ్రామపంచాయతీ మున్నూరుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా దోర్నాల విజయ్‌మోహన్‌రావు ఎన్నికయ్యారు. సంఘం మండల అధ్యక్షుడు లక్కినేని వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన గురువారం గ్రామంలో సమావేశం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా బుర్రి వెంకటేష్, ఆకుల వెంకటేశ్వర్లు సభ్యులుగా నారందాస్ మధుసూదన్, పొగాకు రామారావు, పొగాకు రాజేందర్, మధు, దోర్నాల కృష్ణ, కొండల సతీష్, డేగల రమేష్, దోర్నాల శ్రీనివాస్, కొమ్ము గిరీష్‌రావు, బోనస్ రాజు, పొగాకు ఆనందరావు, నారందాస్ కోటయ్య, నారందాస్ రామారావును ఎన్నుకున్నారు.

కార్మికులను ఆదుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా డీ బ్లాక్ వద్ద లోడింగ్ అన్‌లోడింగ్ టార్పాలిన్ కార్మికులను సింగరేణి ఆదుకోవాలని ఏఐటీయూసీ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నేతలు శంకర్, నాగయ్య కోరారు. గురువారం ఏరియా జీఎం జాన్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. లోడింగ్ అన్‌లోడింగ్ టార్పాలిన్ లెవలింగ్ రంగంలో పని చేస్తున్న కార్మికులు నెల రోజులుగా లోడింగ్ లేక కుటుంబాలు గడవటం కష్టంగా మారిందన్నారు. వందల కుటుంబాలు ఈ రంగంలో ఆధారపడి ఉన్నాయని, వీరితో పాటు గుమస్తాలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో నజీర్ అహ్మద్, షంషుద్దీన్, వలీ, సూరిబాబు, కొమురయ్య, కృష్ణ, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో స్వచ్ఛ పక్వాడా

సింగరేణి(కొత్తగూడెం): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీఎం కార్యాలయంలో గురువారం ఇన్‌చార్జ్ జీఎం బి.రవీందర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఇన్‌చార్జ్ జీఎం మాట్లాడుతూ.. ఈనెల 16 నుండి 30వ తేదీ వరకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం రఘురావిరెడ్డి, ఏజీఎం సామ్యూల్ సుధాకర్, రాజశేఖర్ రెడ్డి, సదానందం, ఐటీ మేనేజర్ శేషశ్రీ, ఎస్టేట్స్ ఆఫీసర్ తావుర్యా, సీనియర్ పీఓలు సుధాకర్, మురళీ, సాగర్, నాగరాజు, రామ్లాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ బుధవారం రాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో మరణించారు. గురువారం ఇల్లెందులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికారల ప్రతినిధి పులిగండ్ల మాధవరావు, టీబీజీకేఎస్ ఇల్లెందు ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ తదితరులు మూలమాలలు, కొవ్వొత్తులతో సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

బక్రీద్ పేరు వినగానే మొదట మనకు హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం, ఇస్మాయిల్ అలైహిస్సలాంల పేర్లు గుర్తుకొస్తాయి. ఈ త్యాగధనులను స్మరించుకుంటూ జరుపుకునే పర్వదినమే ఈదుల్ అజ్ హా.. అదే బక్రీద్. ఈ సందర్భంగా కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో గురువారం ముస్లింలు మసీదులు, ఈద్గాలకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు అల్లాహ్ జీవిత చరిత్రను, బక్రీద్ విశిష్టతను వివరించారు. రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల యాజమానులతో పాటు పలువురు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇళ్ల వద్ద ముస్లింలు ఖుర్బానీలు ఇచ్చి ఆనందాన్ని పంచుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ఈద్గాలో ముస్లింలు..






కొత్తగూడెంటౌన్: ముస్లింలతో అలయ్‌బలయ్ చేసుకుంటున్న ఎమ్మెల్యే వనమా, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, కూనంనేని సాంబశివరావు, ఎడవల్లి కృష్ణ



జూలూరుపాడు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు




పాల్వంచ: శుభాకాంక్షలు చెబుతున్న డీఎస్పీ వెంకటేష్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



టేకులపల్లి: మసీదులో ప్రార్థనలు



ఇల్లెందు: ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న డీవీ తదితరులు



పాల్వంచరూరల్: కిన్నెరసాని మజీదులో..



కొత్తగూడెంటౌన్: చిన్నారులకు శుభాకాంక్షలు చెబుతున్న యెర్రా కామేష్



పెనగడపలోని ఈద్గాలో..



టేకులపల్లి: బేతంపూడి మజీదులో..

నేటితో క్రమబద్ధీకరణకు గడువు ముగింపు

ఇల్లెందు: పట్టణంలోని 24 వార్డులలో నివాస స్థలాల క్రమబద్ధీకరణ గడువు శుక్రవారంతో ముగుస్తుందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సింగరేణి భూముల క్రమబద్ధీకరణ కోసం విడుదల చేసిన జీఓ 76 గడువు శుక్రవారంతో ముగుస్తుందన్నారు. దరఖాస్తు చేసుకోని వారు తక్షణమే ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు.

రైతుల కోసమే అగ్రి క్లినిక్‌లు



మాట్లాడుతున్న సతీష్‌ఖండేల్‌వాల్

ఇల్లెందురూరల్: రైతులకు చట్టాలపై అవగాహన, న్యాయ సహాయం అందించడానికి రాష్ట్రంలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్రారంభించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వలంటీర్ సతీష్ ఖండేల్‌వాల్ అన్నారు. శుక్రవారం మహిళా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దుక్కి దున్నిన నాటి నుంచి పండించిన పంట మార్కెట్‌లో అమ్మేంత వరకు రైతులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వల్ల నష్టాలు, మార్కెట్‌లో మోసాలు, పంటల బీమా, అతివృష్టి, అనావృష్టి వంటి సందర్భాలలో రైతులకు న్యాయ సహాయం అందించేందుకు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు తోడ్పడతాయన్నారు. రైతువేదికలలో ప్రతి శుక్రవారం నిర్వహించే లీగల్ ఎయిడ్ సమావేశాలకు హాజరై న్యాయ సహాయాన్ని పొందాలని సూచించారు.

‘డబుల్’ ఇళ్లపై విచారణ జరిపించండి



మాట్లాడుతున్న కల్తి వెంకటేశ్వర్లు

టేకులపల్లి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు మండల కేంద్రంలో పక్కా ఇళ్లు లేని నిరుపేదలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ.. మండలంలో గతంలో 80 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించగా, ప్రస్తుతం మరో 80 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని ప్రజాప్రతినిధులు, అధికారులు ఏకపక్షంగా లబ్ధిదారులను కేటాయించారని, ప్రస్తుతం మంజూరైన ఇళ్లలోనూ నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. అధికార పార్టీ అనుచరులకే ఇళ్లు కేటాయించడం శోచనీయమన్నారు. ఆయా డబుల్ బెడ్ రూం ఇళ్లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తాటి ముత్తయ్య, జోగ లక్ష్మి, తాటి శేషు, తాటి పద్మ, తాటి లక్ష్మయ్య, వట్టం సమ్మక్క పాల్గొన్నారు.

పోడు సాగుదారులందరికీ పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ నేత యాకన్న

ఇల్లెందురూరల్: పోడు సాగు చేస్తున్న ప్రతి రైతుకు పట్టాలిస్తామని గత ఎన్నికల సమయంలో ప్రకటించిన సీఎం కేసీఆర్ గద్దెనెక్కినాక గాలికొదిలేశారని న్యూడెమోక్రసీ నార్త్ ఈస్ట్ తెలంగాణ రీజినల్ కమిటీ నాయకులు యాకన్న విమర్శించారు. మండలంలోని లచ్చగూడెం గ్రామపంచాయతీ కొమ్ముగూడెం గ్రామంలో పోడు సాగుదారులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు జీవనాధారమైన భూములను ఆక్రమించుకునే చర్యలకు పూనుకుందని ఆరోపించారు. దీన్ని వ్యతిరేకించిన పోడు సాగుదారులపై అక్రమంగా కేసులు బనాయించే కుట్ర చేస్తోందని విమర్శించారు. ఈనెల 24న పట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఎటువంటి కారణాలు చూపకుండానే వాయిదా వేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గోదావరి జలాలను ఏజెన్సీ ప్రాంతాలకు తరలించి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను సాధించుకునేందుకు న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే దశల వారీ ఉద్యమాలకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో శంకర్, బాలు, మాంజ్యా, రమేష్, కిషన్, లక్ష్మి, సుశీల, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లను కొనసాగించండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉమెన్స్ ఇంటర్ కళాశాలలో ఐదేళ్లుగా పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లను కంటిన్యూ చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్, గెస్ట్ లెక్చరర్లను రెన్యూవల్ చేస్తుందని చెప్పారు. కానీ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సింగరేణి ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ పాత వారికి అన్యాయం చేసే విధంగా నోటిఫికేషన్ ఇచ్చిందని ఆరోపించారు. నోటిఫికేషన్ రద్దు చేసి పాతవారికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సాయం

టేకులపల్లి: దాసుతండా పంచాయతీ లచ్చాతండా గ్రామానికి చెందిన తేజావత్ సాలి మూడు రోజుల క్రితం రోడ్డు మీద నడుస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి పడడంతో తలకు బలమైన గాయమయింది. బుధవారం రాత్రి ఆమె ఆస్పత్రిలో మృతి చెందారు. గురువారం విషయం తెలుసుకున్న ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు రూ.10వేలు, స్థానికుడు భూక్యా చందర్‌సింగ్ రాథోడ్ రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబసభ్యులకు అందించారు. అదేవిధంగా ఎ కాలనీతండాకు చెందిన భూక్యా బుజ్జి అనారోగ్యంతో బాధ పడుతోంది. స్థానిక ఉద్యోగులు బాణోతు సక్రు, ధరావత్ చందు, వీరన్న, కిషన్, రమేష్ తదితరులు రూ.11వేలు ఆర్థికసాయం అందించారు.

బహుజన రాజ్యాధికార సాధనే లక్ష్యం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కామేశ్

పాల్వంచ: బహుజన రాజ్యాధికార సాధనే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కోళ్లపూడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన కాటబోయిన వసుంధర ఆధ్వర్యంలో పలువురు బీఎస్పీలో చేరారు. వీరికి కామేశ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాట్లాడుతూ.. బీఎస్పీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. మల్లిఖార్జున్ రావు, బండి రమణి, ఇంద్ర చరణ్, అంజలి, హర్షిత, ఎండీ అబ్దుల్ పాల్గొన్నారు.

భట్టి సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న డాక్టర్ రవి

ఇల్లెందు: సీఎల్పీ లీడర్ భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా ఖమ్మంలో జూలై 2న జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ జి.రవి కోరారు. గురువారం ఇల్లెందులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంతో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కుటుంబ పాలనను అంతమొందించి ప్రజా పాలనను తీసుకరావాలని ఆదిలాబాద్‌లో చేపట్టిన పాదయాత్ర ఖమ్మానికి చేరుకుందన్నారు. ముగింపు సందర్భంగా జనగర్జన సభ నిర్వహిస్తున్నారని, రాహుల్ గాంధీ హాజరవుతున్న ఈ సభను విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇదే సభలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి టీం సభ్యుల చేరిక ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు బాణాల శ్రీనివాస్, బీఎస్ గోపాల్, కృష్ణ, కమల, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

జన గర్జనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రామ్మూర్తి నాయక్

పాల్వంచ: జూలై 2వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ గర్జన సభ, పీపుల్స్ మార్చ్ ముగింపు సభను విజయవంతం చేయాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. గురువారం ఆయన స్వగృహంలో ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి పాల్గొననున్న జనగర్జన సభకు అన్నివర్గాల ప్రజలు తరలి రావాలని కోరారు. ఈ సభలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మరికొంత మంది ప్రముఖ నేతల చేరికలు ఉంటాయని చెప్పారు. వూకంటి గోపాల్‌రావు, జాలే జానకిరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, తుమ్మల శివారెడ్డి, కొండెం వెంకన్నగౌడ్, మనోహర్‌రావు పాల్గొన్నారు.

జూలూరుపాడు: జూలై 2న ఖమ్మంలో జరగనున్న తెలంగాణ జనగర్జన సభను జయప్రదం చేయాలని టీపీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తి నాయక్ పిలుపు నిచ్చారు. గురువారం ఆయన జూలూరుపాడులో స్థానిక విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నేపథ్యంలో ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్ పక్కన గల 100 ఎకరాల స్థలంలో జన గర్జన భారీ బహిరంగకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ సభలోనే సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగిస్తుందన్నారు. నున్నా కృష్ణయ్య, కొలిపాక వెంకటేశ్వర్లు, గోసు రామారావు, కొలిపాక శ్రీనివాసరావు, బానోత్ నవీన్ రాథోడ్, బాబూలాల్, బాబు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు అంగన్‌వాడీల పాదయాత్ర



మాట్లాడుతున్న అబ్దుల్ నబీ

టేకులపల్లి: అంగన్‌వాడీల సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ వరకు నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి మండలం టేకులపల్లి, బొమ్మనపల్లి సెక్టార్లలో నిర్వహించిన అంగన్‌వాడీల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలకు విరమణ సందర్భంగా గ్రాట్యూటీ పెన్షన్ కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అంగన్‌వాడీలకు ఆన్‌లైన్ పనులు చెప్పొద్దని తదితర న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 10న కోర్కెల దినం సందర్భంగా పాల్వంచ తహసీల్ నుంచి కలెక్టరేట్ వరకు 10 కిలోమీటర్ల పాదయాత్రలో అంగన్‌వాడీలు నల్ల చీరలు ధరించి నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కొండపల్లి శకుంతల కోటేశ్వరి, కడుదుల వీరన్న, రజిని, లక్ష్మి, రమ, విజయ, సునీత, సుగుణ పాల్గొన్నారు.

ప్రశ్నించేవారిపై వేధింపులు గర్హనీయం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

ఇల్లెందురూరల్: ప్రశ్నించే గొంతుకలను బంధిస్తున్న సీఎం కేసీఆర్ ఫాసిస్టు చర్యలను ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు బయ్య శారద పిలుపునిచ్చారు. ప్రజానేతలపై ఉపా కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఇల్లెందులో ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ములుగు జిల్లా తాడ్వాయి పోలీసులు పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, మరో 152 మందిపై ఉపా కేసు బనాయించడంలో సీఎం కేసీఆర్ ప్రోద్బలం ఉందని ఆరోపించారు. నాలుగైదు సంవత్సరాలు జైల్లో ఉన్న వారిపై ఉపా కేసులు నమోదు చేయడంలో రాజకీయ కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. తక్షణం ఉపా కేసులు ఉపసంహరించుకోవాలని లేదంటే మహిళా ఉద్యమం ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రేళ్ల నాగలక్ష్మి, తులసి, అనసూర్య, పుష్ప, మల్లికాంబ, వీరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

ఆషాఢమాసంలో వచ్చే తొలి ఏకాదశి పండుగ సందర్భంగా గురువారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు ఆలయాల్లో, ఇళ్లలో భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి విశిష్టతలను వేదపండితులు, అర్చకులు భక్తులకు వివరించారు. పలు ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంటౌన్: గణేష్ టెంపుల్‌లో...



పాల్వంచరూరల్: పూజా కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు



ఇల్లెందు: రామాలయంలో ప్రత్యేక పూజలు

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా సీసీ రోడ్డు

జూలూరుపాడు మండలంలోని మొద్దులగూడెం గ్రామంలోని సీసీ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా సైడ్ బరమ్స్‌ను మట్టితో నింపకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా సైకిల్, బైక్, ఆటో, ట్రాలీ, కారు, ఎడ్లబండ్లతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మీద నుంచి ఇళ్లల్లోకి వెళ్లాలన్నా, ఇళ్లల్లో నుంచి రోడ్డు మీదకు రావాలన్నా నిత్యం సమస్యగా ఉంది. సీసీ రోడ్డు కంటే డ్రెయినేజీలు కిందకు ఉన్నాయని, చిన్నారులు, వృద్ధులు కింద పడి గాయపడుతున్నారన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - జూలూరుపాడు



ప్రశ్నించాల్సిన అధికారి : నాగేందర్,
పీఆర్ ఏఈ జూలూరుపాడు
సెల్ నంబర్: 9052565252